# శిక్ష

లక్ష్మీ శ్రీనివాసన్

"మీరు ఇల్లు అమ్మడానికి వీల్లేదు!..." పిచ్చిగా అరుస్తూ తన భర్త చేతిలో వున్న అట్ట బోర్డును చటుక్కున లాక్కొని లోపలకు పరిగెత్తింది భవాని.

బాబూరావు ఒక్క ఉరుకున ఆమెను సమీపించి, తిరిగి ఆ బోర్డును చేజిక్కించుకున్నాడు.

"వొద్దండీ... మీరు ఇల్లు అమ్మవద్దు... ఆ బోర్డు బయట పెట్టొద్దు!.." అంటూ దగ్గర కొచ్చిన భార్యను బలంగా ఒక్క తోపు తోశాడు బాబూరావు.

విసురుగా వెళ్ళి గోడకు గుద్దుకున్న భవాని "అమ్మా!" అని బాధగా అరచి తల పట్టుకొని వుండిపోయింది.

ఆమెకేమైందో పట్టించుకోకుండా బయటికొచ్చి, తన చేతిలో వున్న 'ఈ ఇల్లు అమ్మబడును' అన్న బోర్డును ఇంటి ముందు తగిలించాడు బాబూరావు.

నాలుగ్గదులున్న ఆ పెంకుటిల్లు మెయిన్ రోడ్‌కు చేర్చి వుంది. ఓ ఇంటి కుండాల్సిన సౌకర్యాలతో బాటు ఆ ఇంట్లో మంచినీళ్ళ కుళాయి కూడా వుంది. ఆసుపత్రి, తాలూకా ఆఫీసు, హైస్కూలు, సినిమా హాల్సులాంటివన్నీ ఆ ఇంటికి సమీపంలో వున్నాయి...

అన్నీ అందుబాటులో వున్నాయని అదేపనిగా వచ్చి పడే బంధువుల బాధపడలేకగాని, ఇల్లమ్మితే తప్ప తీరని బరువు, బాధ్యతలుండిగాని బాబూరావు ఆ ఇల్లు అమ్మడంలేదు. ఎప్పుడైనా అత్తమామలు వచ్చిపోవడం తప్ప ప్రత్యేకించి బాబూరావుకూ చెప్పుకోదగ్గ బందువులు, రక్త సంబంధికులూ ఎవరూ లేరు.

అద్దె ఇంట్లో అనేకానేక అవస్థలు అనుభవించి- తన కొడుక్కలాంటి దుస్థితి సంభవించకూడదని అష్టకష్టాలు పడి ఆ ఇల్లు కట్టాడు బాబూరావు తండ్రి తమ్మిరాజు. స్వంత ఇంటి సుఖం అనుభవించకుండానే ఆ ఇల్లు కట్టిన ఏడాదికి బాబూరావు తల్లి చనిపోయింది. అప్పటికి పదిహేనేళ్ళ వయసున్న కొడుకును బాగా చదివించి- బ్రతకడానికి లోటు లేని ఉద్యోగంతో బాటు అందమైన అమ్మాయిని చూసి పెళ్ళి చేసి, ఒక మనుమరాల్ని కూడా కళ్ళ చూసి నాలుగేళ్ళ క్రితం కన్ను మూశాడు తిమ్మరాజు- తను చనిపోయే ముందు ఆ ఇంటి మీదున్న కొద్దిపాటి అప్పు తీర్చివేసి, కొడుకు జీవితాన్ని పూలబాట చేసి మరీ వెళ్ళిపోయాడతను.

ఆ పూల బాటను ముళ్ళబాటగా మార్చుకున్నాడిప్పుడు బాబూరావు. ఆ బాటనింకా ఇంకా క్లిష్టతరం చేసుకొని, తండ్రి ఎంతో కష్టపడి కట్టించిన ఆ ఇంటినీ, అన్నిటికీ అందుబాటులో అనుకూలంగా వున్న ఆ ఇంటిని అమ్మదల్చుకున్నాడు బాబూరావు.

అతని స్థితికి రావడానికి కారణం తాగుడు. ఒకప్పుడు తాగే వాళ్ళని చూసి అసహ్యించుకునే బాబూరావు అకస్మాత్తుగా గొప్ప తాగుబోతైపోయాడు.. అసలు తాగకుండా వుండలేని పరిస్థితికొచ్చేశాడు. ఇది స్వయం కృతాపరాధమే తప్ప- అతను తాగుబోతు కావడానికి ఏ ఒక్కరూ కారణం గాదు- సరదాగా ఒక్కసారి తాగి చూడాలన్న కోరిక అతణ్ని సదా తాగుబోతుగా మార్చి సర్వ నాశనం చేసింది.

ఇది మంచి పని కాదని భవాని ఎన్ని విధాల చెప్పినా అతడు వినిపించుకోలేదు. సరి కదా ఆమెను హింసించడం ప్రారంభించాడు. ఈ విషయం భవాని తండ్రి ఆదిశేషయ్యకు తెలిసేసరికి చాలా ఆలశ్యమైపోయింది.

ఆయన కాస్త డబ్బూ, పరపతీ వున్నవాడు- గౌరవ మర్యాదల కోసం ప్రాకులాడే వాడూను. అల్లుడి తాగుడు జబ్బు బాగా ముదిరిపోయిందని తెలియగానే వచ్చి- ఆ విషయం అంతకు ముందెప్పుడూ చెప్పనందుకు కూతుర్ని చివాట్లు పెట్టాడు. అల్లుడి గురించి అన్ని విషయాలు సవిస్తరంగా తెలుసుకొని, అతడు కింగ్స్ బార్‌లో తప్పతాగి తూలుతూ పడి లేస్తూ రావడం స్వయంగా చూశాడు.

విలువ లోతు బురదలో కూరుకుపోయిన అతణ్ని ఒక్కసారిగా పైకి లాగడం కష్టమని గ్రహించి- ఒక రోజు, "అల్లుడూ! నువ్వు తాగితే తాగు... మనమంతా తాగకపోతే వూళ్ళో బార్లు వర్ధిల్లేదెట్లా?.. వీధికో బ్రాందిషాపు... సెంటరుకో బారు వెలుస్తున్నాయంటే మనమంతా తాగడానికే.. అంచేత నిన్ను నేను తాగవద్దనడం లేదు. కానీ, లిమిట్‌గా తాగు.. ఓ పెద్ద బాటిల్ కొని తెచ్చుకొని రోజుకు రెండో, మూడో పెగ్గులు లిమిట్ పెట్టుకో... నీ కాళ్ళకు సాష్టాంగపడి మొక్కుతాను!" అన్నాడు అన్నంత పనీ చెయ్యడానికి సిద్ధ పడుతూ.

"మీరంత పని చెయ్యొద్దు... నా మంచి కోరి చెప్పిన మీ మాటలు కాదంటానా! మీరు చెప్పినట్లే చేస్తాను" అని మామగారికి మాటిచ్చాడు బాబూరావు.

ఆ మాట నిలబెట్టుకుంటాడన్న ఆశతో అల్లుడికి చెప్పవలసినవన్నీ మరోసారి చెప్పి ఆ మర్నాడే వెళ్ళిపోయాడు ఆదిశేషయ్య.

నిజంగా తాగుబోతు మాటలు నిజం కావుగనక- బాబూరావు విషయంలో కూడా అదే జరిగింది... ఆ వాగ్దానం చేశాక అతడు తాగడం మరింత ఎక్కువైందే తప్ప తగ్గలేదు. వచ్చిన జీతం సరిపోక పోయ్యేసరికి ఉద్యోగంలో అవినీతికి పాల్పడ్డంతో అది పై అధికారులకు తెలిసిపోయింది. ఫలితం... హఠాత్తుగా అతడు ఉద్యోగం నుంచి తొలగించబడ్డాడు. దాంతో అతను అంతకు ముందే ఒకరికి తెలియకుండా ఒకరి దగ్గర చేసిన అప్పులన్నీ వెలుగులోకొచ్చాయి. ఒకటికి ఒకటి కలిపితే రెండైనట్టు ఆ అప్పులు కొన్నివేలై బాబూరావు పరువు తీసేందుకిప్పుడు సిద్ధంగా వున్నాయి.

ఇలాంటి విష వలయంలో చిక్కుకుపోయిన బాబూరావుకు ఇల్లు అమ్మడం కన్నా మరో గత్యంతరం కనిపించలేదు. దానికి తోడు నాలుగు రోజుల్నుండి అతడికి మందు పడకపోవడంతో మతిపోతోంది. అందుకే ఆ రోజు అప్పటికప్పుడు ఆ బోర్డు రాసి- ఇల్లాలు వద్దంటున్నా వినక ఇంటి ముందు తగిలించాడు బాబూరావు.

ఎంత లేదన్నా తన యిల్లు పాతిక వేలకు తక్కువ రాదు. అప్పులన్నీ తీర్చగా అయిదారు వేలైనా మిగుల్తాయి. ఆ మిగిలిన డబ్బుతో జాలీగా, కులాసాగా బారులో గడపొచ్చుని... విస్కీ బ్రాందిల మత్తులో మునిగి తేలొచ్చునీ, అనుకుంటున్నాడు బాబూరావు. తలకు దెబ్బ తగిలి బాధ పడుతున్న భార్య కాని, తల్లి దగ్గర కూర్చొని తన వైపు బిక్కు, బిక్కుమని చూస్తున్న అయిదేళ్ళ కూతురుగానీ అతడి కళ్ళకు కనిపించడం లేదు.- అతడికి కనిపిస్తున్నవల్లా తనెప్పుడూ వెళ్ళే కింగ్స్ బారూ, ఆ బార్లో వుండే విస్కీ, బ్రాంది బాటిల్సూను.

-తన మెళ్ళోని వస్తువులన్నీ తగలేశాడు. వున్న

వుద్యోగం పోగొట్టుకున్నాడు. వుండేందుకు నీడ కూడా లేకుండా చేస్తున్నాడు... నేనేం పాపం చేశాను దేవుడా? నాకెందుకిలాంటి శిక్ష విధించావు??... తగిలిన దెబ్బతోపాటు బాధలన్నీ తల్చుకొని విలపిస్తోంది భవాని ఆమేకేం చెయ్యడానికి పాలుపోవడం లేదు. ఆలోచించి, ఆలోచించి ఆ సాయంత్రం వీలు చూసుకొని పక్కింటి వాళ్ళ ద్వారా తన తండ్రికి కబురుపెట్టింది.

*　　*　　*　　*　　*

బాబూరావు ఇంటి మీద చాలామంది దృష్టి పడింది. అతడి పరిస్థితి తెలిసిన కొందరు ముందుకొచ్చి ఆ ఇంటిని పదిహేను వేలకు, ఇరవై వేలకు అడగటం మొదలు పెట్టారు- ఇలా మూడు రోజులు గడిచిపోయాయ్... అప్పుల వాళ్ళు ఆదేపనిగా వచ్చి పర్వం.. తాగేందుకు డబ్బు లేకపోవడంతో ఇరవై వేలకైనా ఇల్లు ఇచ్చేసే నిర్ణయానికొచ్చేశాడు ఇక తట్టుకోలేక బాబూరావు.

అతడలాంటి నిర్ణయానికొచ్చిన మరుసటి రోజు ఆ ఇల్లు కొంటానంటూ వచ్చాడొక వ్యక్తి. ఆ వ్యక్తిని చూస్తూనే బాబూరావు నిర్ఘాంతపోయాడు. అసంకల్పితంగా అతడి శరీరంలో సన్నని ఒణుకు మొదలైంది. అతడి హృదయంలో అంతులేని సంఘర్షణ చెలరేగింది... తనను తాను కంట్రోలు చేసుకునే ప్రయత్నం చేస్తూ- "మీరు.. మీరు..." అన్నాడు, తడబాటుతో బాబూరావు. అదే సమయంలో లోపల్నుంచి ఆ వ్యక్తిని చూసిన భవాని ఉలిక్కిపడింది.

ఆ వ్యక్తి చిన్నగా నవ్వి- "ఔను, నేనే, కింగ్స్ బార్ ప్రొప్రయిటర్ భీమేశ్వర్రావుని. నన్ను చూసి ఎందుకంత కంగారు పడతారు. మీరిల్లు ఎంతకైతే అమ్మదల్చుకున్నారో ఖచ్చితంగా చెప్పండి!" అన్నాడు.

ఆ మాటలు బాబూరావుకు సరిగ్గా వినిపించలేదు- ఆ కింగ్స్ బార్‌కె వెళ్ళి కొన్ని వేల రూపాయలు తగలేశాడు తను. తనా బారులో తాగి తాగి ఇల్లమ్ముకునే హీన స్థితికి వస్తే- తనకా విస్కీ, బ్రాందీలు అమ్మిన వ్యక్తి తనిల్లు కొనటానికి వచ్చాడు.. ఎంత విచిత్రం!!... బాబూరావు కళ్ళు నెమ్మదిగా తెరుచుకోసాగాయి. ఇక ముందెప్పుడూ తాగకూడదని అప్పటికప్పుడు ఆత్మసాక్షిగా నిర్ణయించుకున్నాడతను- అయితే సమయం మించిపోయింది. ఇల్లు అమ్మక తప్పదు... ఇల్లమ్మి అప్పులు తీర్చగా మిగిలిన డబ్బుతో ఏదొక వ్యాపారం చేసి జీవితాన్ని చక్కదిద్దుకోవాలన్న ఆలోచన ఆ క్షణంలో బలీయంగా కలిగిందతనికి.

"అలా మౌనంగా వుండిపోయారేమిటి? ఇల్లు ఎంతకైతే ఇవ్వదల్చుకున్నారో చెప్పండి! మీకూ.



నాకూ రెండే రెండు మాటలు!" అన్నాడు కొన్ని క్షణాల తర్వాత భీమేశ్వరరావు.

"ముప్ఫై వేలు!" అన్నాడు తన ఆలోచనల్లోంచి తేరుకొని బాబూరావు

'కాదు. ఇరవై అయిదు వేలిస్తాను రెండు రోజుల్లో రిజిస్ట్రేషను ఇరవై రోజుల్లో మీరు ఇల్లు ఖాళీ చెయ్యడం జరిగిపోవాలి!" అన్నాడు నిర్మొహమాటంగా భీమేశ్వర్రావు

అందుకంగీకరించాడు బాబూరావు. ఆ వెంటనే వెయ్యి రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి, అగ్రిమెంట్ రాయించుకొని, ఎల్లుండి సరాసరి రిజిస్ట్రేషన్ ఆఫీసుకు రమ్మని చెప్పి వెళ్ళిపోయాడు భీమేశ్వర్రావు

ఆ డబ్బు భార్యకిచ్చి; "భవానీ, ఇంత కాలం ఇలా ప్రవర్తించినందుకు నన్నుక్షమించు! ఇక ముందెప్పుడూ తాగనని నీకుమాటిస్తున్నాను నన్నునమ్ము!" అన్నాడు బాబూరావు.

'ఇప్పటికైనా మీరామాట మీద నిలబడకలిగితే నాకదే పదివేలు!" అంది భవాని.

* * * * *

అనుకున్నట్టుగానే అన్నీ జరిగిపోయాయి. తాగుడంటే ఒకప్పుడెంత అసహ్యించుకునేవాడో ఇప్పుడంతకు మించి 'అసహ్యించుకుంటున్నాడు బాబూరావు అప్పులన్నీ తీర్చగా మిగిలిన డబ్బుతో అతడేదో చిన్న వ్యాపారం కూడా ప్రారంభించాడు.

భర్త అన్న మాట మీద నిలబడతాడనీ, అతడిలో అంతటి మార్పొస్తుందనీ వూహించని భవాని ఆనందంతో ఉక్కిరి బిక్కిరైంది- అయితే తనెంతో కష్టంలో వుండి కబురు పెడితే తండ్రి రానందుకు బాధా; ఇల్లు ఖాళీ చెయ్యాల్సిన గడువు దగ్గర పడుతుందన్న బెంగా ఆమెను పట్టుకు పీడించసాగాయి. ఆ రోజు బయటికెళుతున్న భర్తనాపుజేసి- "ఇక మూడు రోజుల్లో అతడిచ్చిన గడువు పూర్తయిపోతుంది. ఇంటి విషయమేమైనా ఆలోచిస్తున్నారా?" అంది భవాని.

## హృద్రోగానికి కొత్త చికిత్స

హృద్రోగాల చికిత్సకు మరో నూతన పద్ధతి మరో రెండు సంవత్సరాలలో డాక్టర్లకు అందుబాటులోకి రానున్నది. టి.పి.ఏ. అనేది రక్త ప్రవాహంలోని అడ్డంకులను కరిగించగల టిష్యూ ప్రొటీను ఆరోగ్యవంతుల శరీరాలలో ఈ ప్రొటీను సమృద్ధిగా ఉంటుంది. పశ్చిమజర్మనీలోని ఒక పరిశోధనా సంస్థ ఒక అమెరికా పరిశోధనా సంస్థ సహకారంతో ఈ ప్రొటీనును తయారుచెయగల జీన్లను వేరు పరిచింది ఈ జీన్లను జంతువుల శరీరంలో, జీవకణాలలోకి ఎక్కించి, అది ఈ ప్రొటీన్ను తయారు చేస్తున్నట్లు తెలుసు కొన్నారు. దీనిని ఇంజెక్షన్ల రూపంలో శరీరంలోకి పంపటానికి వీలవుతుంది. ఇంతవరకు అందిన ఫలితాలు ఆశాజనకంగా ఉన్నట్లు డాక్టర్లు తెలియజేశారు

(గ్లోబల్)

## శిక్ష

"అద్దె యిల్లు కోసం ప్రయత్నిస్తున్నాను భవానీ!ఎక్కడ చూసినా మనం భరించలేని అద్దెలు.. మనకందుబాటులో వుండే ఇల్లు ఇంతవరకెక్కడా కనిపించలేదు ఇప్పుడదే ప్రయత్నం మీద బయల్దేరాను!" సిగ్గు పడుతూ చెప్పి గబ గబా వెళ్ళిపోయాడు బాబూరావు.

అతడి మాటలతో భవాని బెంగ మరింత ఎక్కువైంది ఆ దొరకబోయే ఇల్లెక్కడో... అక్కడెలా వుంటుందో?... అద్దె ఇళ్ళలో ఆమె ఎప్పుడూ వుండకపోయినా వుంటున్న వాళ్ళ బాధలెన్నో కళ్లారా చూస్తూనే వుంది, అవన్నీ తల్చుకొని ఆమె ఆందోళన పడుతున్న సమయంలో-తండ్రి ఆది శేషయ్య వచ్చాడు. ఆయన్ని చూసి వెంటనే మాట్లాడలేదు భవాని.

"నా మీద కోపం వచ్చిందామ్మా?" అన్నాడు, ఆమె, మనసులోని భావం గ్రహించినట్టు ఆదిశేషయ్య.

"లేదు నాన్నా! అంతా జరిగిపోయాక వచ్చినందుకు సంతోషంగా వుంది!" అంది నిష్ఠూరంగా భవాని.

"ఔనమ్మా, అంతా జరిగిపోయింది... ఆ పరిస్థితిలో నేనొచ్చినా అది జరక్క మానదు కదా? ఇంతకు ముందు అల్లుడికెన్నో విధాలుగా చెప్పి చెప్పి నా మాట విలువ కూడా పోగొట్టుకున్నాను- సరే, ఇప్పుడెలా వుందమ్మా నీ భర్త పరిస్థితి? అతడిలో మార్పొచ్చిందని విన్నాను!?" అన్నాడు ఆదిశేషయ్య.

"మీరు విన్నది నిజమే నాన్నా! కానీ, ఏం లాభం?... ఆ మార్పొచ్చేసరికి అన్నీ అయిపోయినై. ఆఖరుకు వుండే నీడ కూడా పోయింది. ఇప్పుడెక్కడ వుండాలో ఏమిటో అంతా అయోమయంగా వుంది!" అంది అవ్యక్తమైన బాధతో భవాని.

కొన్ని క్షణాలపాటు కూతురి మొహంలోకి పరీక్షగా చూసి, "నువ్వెక్కడికీ వెళ్ళనవసరం లేదమ్మా... ఈ ఇల్లు నీ పేరున నేను కొన్నాను! ఈ ఇల్లు నీది!!" అన్నాడు ప్రేమగా ఆదిశేషయ్య.

"నాన్నా!" అంది ఆశ్చర్యంగా భవాని.

"నేను చెప్పేది నిజమే తల్లీ! నువ్వా రోజు కబురు పెట్టగానే నాకేం తోచింది కాదు. ఆ సమయంలో వచ్చి అప్పులన్నీ తీర్చి, ఇల్లు అమ్మకుండా చేసినా అల్లుడు మారతాడన్న నమ్మకం లేదు. అతడిలో ఎలా మార్పు తీసుకు రావాలని ఆలోచిస్తుంటే-కింగ్స్ బార్ ప్రొప్రయిటరు భీమేశ్వర్రావు నాకు గుర్తొచ్చాడు. అతడు మన వూరి మున్సబుగారబ్బాయన్న సంగతి నీకు జ్ఞాపకం వుండే వుంటుంది. వెంటనే వచ్చి, ఈ కథంతా చెప్పి అతణ్ణి ప్రాధేయపడి ఇక్కడకు పంపించి ఈ ఇల్లు కొనిపించాను.

"అది రోజున మళ్లీ నీ పేరున మార్పు చేయించి ఇలా వచ్చాను. డబ్బు ఖర్చయినా భీమేశ్వరరావు రావడంతో అల్లుడిలో మార్పొచ్చినందుకు ఆనందంగా వుంది. నా ప్రయత్నం వృధా కాలేదనే అనిపిస్తోంది!" అన్నాడు గద్గదిక స్వరతో ఆదిశేషయ్య.

"మిమ్మల్నింత తప్పుగా అర్థం చేసుకున్నాను నాన్నా!నా కోసం మీరెంత శ్రమ పడ్డారు!!" అంది, బాధా, ఆనందమూ కలగలసిన కంఠంతో భవాని.

"శ్రమ కాదు తల్లీ! వేలకు వేలు కట్నమిచ్చి, కాళ్ళు కడిగి కన్యాదానం చేసే మామలకు కొందరల్లుళ్ళు విధించే శిక్ష ఇది!.. కొన్నాళ్ళపాటు ఈ ఇల్లు అద్దెకిచ్చేటట్టుగా భీమేశ్వరరావుని నీ భర్తతో చెప్పమంటాను. ఈ నిజం మాత్రం అల్లుడికప్పుడే తెలియనివ్వకు!!" అన్నాడు ఆవేదనగా ఆదిశేషయ్య.

భవాని కళ్ళెందుకో చెమ్మగిల్లాయి. ☐

